బడి గంట పెరిగింది

- మారనున్న పాఠశాల టైమ్‌టేబుల్
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతుల నిర్వహణ
- భోజన విరామానికి గంట సమయం కేటాయింపు

గుర్ల: ప్రభుత్వ పాఠశాలల పని వేళలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో పాఠశాల చొప్పున ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్‌టేబుల్‌ను అమలు చేయనున్నారు. దీనిపై వచ్చే అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఈ నెల 16న జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి.

జిల్లాలోని 27 ఉన్నత పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అధికారులు ఎంపిక చేశారు. గర్ల మండలం కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాలను అధికారులు మోడల్ స్కూల్‌గా ఎంపిక చేశారు. ఇందులో ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్‌టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించనున్నారు. ఈ ఐదు రోజుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను పరిశీలించి ఎంఈఓలు నివేదికలు తయారు చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయనున్నారు.

ఫస్ట్ పీరియడ్ 50 నిమిషాలు

ప్రస్తుతం పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాగా.. కొత్త టైమ్‌టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయాన్ని 5 నిమిషాల చొప్పున, భోజన విరామ సమయాన్ని 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్‌ను 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత 3 పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాలు చొప్పున ఉండగా.. వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్‌ను మార్చకుండా.. అనంతరం 3 పీరియడ్లను 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పు కారణంగా రోజులో పాఠశాల సమయం గంట పెరగనుంది. అయితే కొత్త పనివేళలపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.



గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ ఆదేశానుసారం



గుర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్‌టేబుల్ మేరకు తరగతులు నిర్వహించడం జరుగుతుంది. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల నుంచి వచ్చిన ఆదేశాలను గుర్ల హైస్కూల్ హెచ్‌ఎంకు తెలియజేశాం. అక్కడి ఫలితాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పనివేళలు మార్పుచేస్తాం.

– ఎస్.భానుప్రకాష్, ఎంఈఓ, గుర్ల

కొత్త టైమ్‌టేబుల్ ఇదే..

ఫస్ట్ బెల్	9 గంటలకు
సెకండ్ బెల్	9.05
స్కూల్ అసెంబ్లీ	9.05 -9.25
మొదటి పీరియడ్	9.25 -10.15
2వ పీరియడ్	10.15 -11.00
బ్రేక్	11.00 -11.15
3వ పీరియడ్	11.15 -12.00
4వ పీరియడ్	12.00 -12.45
లంచ్ బ్రేక్	12.45 -01.45
5వ పీరియడ్	01.45 -02.30
6వ పీరియడ్	02.30 -03.15
బ్రేక్	03.15 -03.30
7వ పీరియడ్	03.30 -04.15
8వ పీరియడ్	04.15 -05.00

క్లుప్తంగా

పండ్ల తోటల పరిశీలన



సపోటా తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ కళ్యాణ్‌చక్రవర్తి

దత్తిరాజేరు: మండలంలోని తాడేందొరవలస వద్ద ఉన్న సపోటా తోటలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి బుధవారం సాయంత్రం పరిశీలించారు. రైతులతో మాట్లాడి తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకం అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందని రైతులు చెప్పారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని డ్వామా పీడీ సూచించారు. పండ్ల తోటల సాగుకు ముందుకువచ్చే రైతులకు మొక్కలు అందజేయాలని ఏపీఓను ఆదేశించారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు



వేపాడ రైతుసేవా కేంద్రంలో సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ రైతు సేవా కేంద్రంలో రబీ సాగుకు అవసరమైన వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వీఏఏ పవన్ బుధవారం తెలిపారు. వేరుశనగ సాగు చేసే రైతులు తమ ఆధార్, 1బీతో రైతుసేవా కేంద్రానికి వచ్చి విత్తనాలు పొందవచ్చని అన్నారు. రైతులు 30 కేజీల బస్తాకు సబ్సిడీ పోను రూ.1800లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే వరి క్వింటాకు సాధారణ రకం రూ.2300లు, ఏ గ్రేడ్‌కు రూ.2320లు మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ.117 అదనంగా చెల్లిస్తున్నట్లు చెప్పారు.

మల్లివీడు మాజీ సర్పంచ్ మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామ మాజీ సర్పంచ్ బోను పవన్‌కుమార్(55) అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన 2014–2019 వరకు మల్లివీడు పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పవన్‌కుమార్ మృతి పట్ల ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, పారిశ్రామిక వేత్త బోను సన్యాసిరావు(సన్ని), తదితరులు సంతాపం తెలియజేశారు.


బహుజన ధర్నా కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శివప్రసాద్

చీపురుపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగించే పోరాటంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎ.శివప్రసాద్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న విశాఖపట్నంలోని కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుదవారం విడుదల చేశారు. ఈ ధర్నాలో బీఎస్పీ ఏపీ ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్ పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సబ్బి సత్యనారాయణ, ప్రతినిధులు కె.నర్సింహులు, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శృంగవరపుకోట: పట్టణంలోని సూర్యదేవాలయం 41వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జానకీభాయి కుటుంబ సభ్యులు గార్లపాటి సత్యసాయి, పట్నాల ప్రసాదరావు, కె.రాజేష్, ఎం.ఫణీంద్ర దంపతులు ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహించారు. అర్చకులు విన్నకోట సూర్యనారాయణశర్మ, చిట్టిశాస్త్రి, అయ్యప్ప, తదితరులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

- యూటీఎఫ్ డిమాండ్

గజపతినగరం: ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ పంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం యూటీఎఫ్ మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ.. పాఠశాల విద్యావ్యవస్థ(ప్రాథమిక విద్య)ను నాశనం చేసే జీఓ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. 12వ పీఆర్‌సీ నివేదిక మేరకు ఐఆర్‌ను ప్రకటించాలని, 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, వారిపై పనిభారాన్ని తగ్గించాలని, అర్హత గల ఉపాధ్యాయులకు నెలవారీ ప్రమోషన్లు ఇవ్వాలని, శాశ్వత బదిలీ కోడ్‌ను తీసుకొచ్చి బదిలీ ప్రక్రియలో అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీచేయాలని, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే పాఠశాల పనివేళల పెంపు నిర్ణయాలన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాము, జేఆర్‌సీ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను గుర్తించండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కళ్యాణి

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులను గుర్తించి వారి నివేదికలను తయారు చేయాలని ఎంపీడీఓ బి.కళ్యాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిసెంట్లతో బుధవారం ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి వారికి ఆయా రంగాల్లో మరింత మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో స్కిల్ సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. సర్వే సిబ్బంది పక్కాగా వివరాలు నమోదు చేయాలని, ఏ మాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం అయ్యిందా లేదా కూడా తెలుసుకోవాలని సర్వే సిబ్బందికి సూచించారు.

పీఆర్‌సీ తక్షణమే అమలుచేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నారాయణరావు

- ఏపీఎస్‌జీపీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరావు

చీపురుపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి జి.నారాయణరావు కోరారు. పట్టణంలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న తోటలో బుధవారం చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీని అమలు చేసి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. అలాగే ఉద్యోగులకు సంబంధించిన కమిటేషన్‌ను పునరుద్ధరించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులంతా ఒక్కటై వారి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. చీపురుపల్లి, గరివిడి మండలాల్లో విశ్రాంత ఉద్యోగుల కోసం సంఘ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, గరివిడి సురేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జగన్నాథం, విజయనగరం పట్టణ అధ్యక్షుడు వి.సూర్యనారాయణ, చీపురుపల్లి, మెరకముడిదాం యూనిట్ అధ్యక్షుడు పి.సత్యం, ప్రధాన కార్యదర్శి అంపోలు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు సుబుద్ది లక్ష్మణరావు, కోశాధికారి కెల్ల జగన్నాథరావు, ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

కొండగండ్రేడులో విషజ్వరాలు

గుర్ల: మండలంలోని కొండగండ్రేడులో విషజ్వరాల విజృంభిస్తున్నాయి. గ్రామంలో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు విషజ్వరాల బారిన పడ్డారు. ముగ్గురు డయేరియాతో బాధపడుతున్నారు. ఒకరు డెంగీ, మరొకరు టైఫాయిడ్‌తో బాధపడుతున్నట్లు స్థానికులు చెపుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారుల మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం వల్ల మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. దోమలు పెరిగిపోయి వ్యాధులు వ్యాపింప చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

యూరియా కొరత

గుర్ల: మండలంలోని జమ్ము సచివాలయంలో యూరియా కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న పంటకు ప్రస్తుతం యూరియా వేయాల్సి ఉండడంతో ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. యూరియా ధర రూ.267 ఉన్నప్పటికీ రైతుల అవసరాన్ని బట్టి గరివిడి, గుర్ల మండలాల్లోని ప్రైవేట్ డీలర్లు అధిక ధరకు విక్రయిస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.350లకు విక్రయిస్తున్నారని రైతులు అంటున్నారు. జమ్ము సచివాలయంలో యూరియా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ (33/11 కె.వి.) పరిధిలో ఎల్.కోట రూరల్ ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్జాం, కళ్లేంపూడి, సీతారాంపురం, వేపాడ మండలం బొద్దాం, కొత్త బొద్దాం, ఒబలయ్యపాలెం, ముకుందపురం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

23న బడ్జెట్ సమావేశం

లక్కవరపుకోట: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 23న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గజపతినగరం: మరుపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్‌కు సకాలంలో జీతం అందేలా చూడాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. మరుపల్లి పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదు నెలలుగా జీతం అందకపోయినా సేవలందిస్తున్న వాచ్‌మెన్, స్వీపర్లను ఆమె అభినందించారు. వారికి ఇక నుంచి ఆస్పత్రి ఫండ్ నుంచి ప్రతీ నెల సకాలంలో జీతం అందివ్వాలని తీర్మానించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, స్థానిక సర్పంచ్ లెంక రామలక్ష్మి, ఎంపీడీఓ బి.కళ్యాణి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణారెడ్డి, డాక్టర్ సుష్మా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 'చలో విశాఖ'



పోస్టర్లు విడుదల చేస్తున్న మాలల సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్ర మాలల గర్జన ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విశాఖ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ మాలల కన్వీనర్ టొంపల సంజీవరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 8న తలపెట్టిన ఛలో విశాఖ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్ర మాలల కన్వీనర్ పతివాడ రాంబాబు ఆధ్వర్యంలో డిసెంబర్ 8న విశాఖపట్టణంలోని గురజాడ కళాక్షేత్రంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మాలలంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటాన అప్పారావు, ఉత్తరాంధ్ర మాలల గర్జన సంఘం ప్రతినిధులు అద్దూరు కృష్ణ, బూర సూర్యనారాయణ, బోడసింగి పోలీసు, దీనుపల్లి రాము, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, విద్యార్థులు ప్రతిరోజు ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లి పత్రికలు, పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యువత మొబైల్ ఫోన్లను పక్కనపెట్టి రోజులో కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



వేపాడ: వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 జగదీశ్వరరావు



శృంగవరపుకోట: ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



గుర్ల: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై నారాయణరావు



చీపురుపల్లి: గరివిడి శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రామారావు



మెరకముడిదాం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కుమార్



లక్కవరపుకోట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తరగతి గదిలో ఆంగ్లభాష వాతావరణం కల్పించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు



చీపురుపల్లి: మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యంనాయుడు



వేపాడ: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ-1 జగదీశ్వరరావు

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆంగ్లభాషపై ఆసక్తి పెంపొందించేందుకు తరగతి గదుల్లో ఆంగ్లభాష వాతావరణం కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషపై నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లభాష ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. విద్యార్థులతో చిన్న చిన్న పదాలను ఆంగ్లంలో మాట్లాడిస్తూ ఆంగ్లభాషపై వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టరాదన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తి పెంచేలా బోధన

గుర్ల: విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా బోధించాలని డీఈఓ మాణిక్యంనాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను బుధవారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచి ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా బోధనలు చేయాలన్నారు. సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ సన్యాసిరాజు, ఎంఈఓలు భానుప్రకాష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్కింగ్ మోడల్ ఉపయోగించండి

వేపాడ: ఉపాధ్యాయులు టీఎల్‌ఎంతో పాటు వర్కింగ్ మోడల్స్ ఉపయోగించి బోధించడ వల్ల విద్యార్థులకు సబ్జెక్టులపై పట్టువస్తుందని ఎంఈఓ-1 జగదీశ్వరరావు అన్నారు. వేపాడ, నీలకంఠరాజపురం పాఠశాలల్లో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. వేపాడ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, మెనూ, భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలభాస్కరరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలి

- వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.విజయ



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ ఎల్.విజయ

లక్కవరపుకోట: రబీ పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని కొత్తవలస డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.విజయ అన్నారు. మండలలోని రంగరాయపురం పంచాయతీ వెంకన్నపాలెం గ్రామంలో ఏఓ స్వాతికుమారి అధ్యక్షతన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఏ విజయ మాట్లాడుతూ.. 2024 రబీ పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలన్నారు. అపరాల పంటలైన పెసలు, మినుములు, మొక్కజొన్న తదితర పంటలకు డిసెంబర్ 15 లోగా, రబీ వరి పంటకు డిసెంబరు 31లోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. అపరాల పంటలకు మండలాన్ని యూనిట్‌గా, వరి పంటకు జిల్లాను యూనిట్‌గా పరిగణించి పరిహారం చెల్లిస్తారని తెలిపారు. రబీలో అపరాల సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.